www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231



విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి


ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 6 | 15-11-2021 | పుటలు : 4

## గ్రంథాలయ వేదము




"వాయువు ఎల్లవారికి ఎట్లు స్వాధీనమైయున్నదో
జ్ఞానము కూడా అట్లు స్వాధీనము కావలయును
ఉదకము ఎల్లవారికి ఎట్లు సేవ్యమై యున్నదో జ్ఞానము
కూడా అట్లు సేవ్యమై ఉండవలెను.
సూర్యచంద్ర మండలములు తేజస్సు ఎల్లవారికి ఎట్లు
సౌఖ్య ప్రదముగానున్నదో జ్ఞానము కూడా అట్లు
సౌఖ్యప్రదము కావలయును"

- చిలకమర్తి లక్ష్మీనరసింహం.

## గ్రంథాలయ వారోత్సవాలు

(నవంబర్ 14 నుండి 21 వరకు)

శుభాకాంక్షలతో....

- నన్నయవాణి

# అబుల్ కలాం ఆజాద్ జయంతి



మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ

**11.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఈసీ హాల్ లో గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 133వ జయంతిని నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖామంత్రిగా భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విశేషకృషి చేశారని కొనియాడారు. భారతదేశ విద్యావ్యవస్థకు పునాదులు వేసిన ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. మౌలానా ఆజాద్ మతాలకు అతీతంగా పని చేసారని అన్నారు. స్వదేశీ ఉద్యమం, రౌలత్ చట్టం, ఉప్పుసత్యాగ్రహం వంటి ఉద్యమాలలో గాంధీజీ వెన్నంటే ఉండే వారన్నారు. అబుల్ కలాం ఆజాద్ ను మార్గ దర్శకంగా చేసుకొని అందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం నూతన జాతీయ విద్యావిధానం విద్యార్థులకు ఎంతో ప్రాధాన్యాన్ని స్తుందని తెలిపారు. విద్యాలయాలలో విద్యార్థులే కీలకమని వారి అభివృద్ధికి కోసం అధ్యాపకులు పని చేయాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు విద్యార్థులను ఉన్నత శిఖరాలవైపు మార్గ నిర్దేశం చేయాలన్నారు. విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధిచేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా విద్యార్థులను పోత్సహించాలన్నారు. నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ మరియు తాడేపల్లిగూడెం క్యాంపస్ లలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.పి.వెంకటేశ్వరరావు, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.ఉమామహేశ్వరి, డా.ఎం.గోపాలకృష్ణ, హనుమంతు, బాలకృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.




## మంచిమాట

చేయబోయే పనిని తెలుసుకోవటమే వివేకం.
దానిని ఎలా చేయాలో తెలుసుకోవటం నైపుణ్యం.
దానిని పూర్తి చేయటం సద్గుణం!!

- డి.ఎస్. గోర్టన్

# నన్నయలో డ్రోన్ సర్వే



**11.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం క్యాంపస్ లో గురువారం డ్రోన్ ని ఉపయోగించి ఐ.పేజ్ కంపేనీ సర్వే నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. ఇటీవల వీసీ ఆహ్వానం మేరకు గరుడలిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ డా.వి.ఎస్.ఎస్.కిరణ్ యూనివర్సిటీని సందర్శించి యూనివర్సిటీ అభివృద్ధికి సహకరిస్తారని తెలియజేశారు. దానిలో భాగంగా ఐ.పేజ్ కంపేనీ టెక్నీషియన్స్ సాయి చరణ్,అరుణ్ లు సుమారు 100 ఎకరాల క్యాంపస్ భూమిని ఏరియల్ చిత్రాలు తీశారన్నారు. ఈ సర్వే క్యాంపస్ లోని అన్ని భవనాలు మరియు సౌకర్యాలను అక్షాంశ మరియు రేఖాంశాల ప్రకారం నిర్దేశిస్తుందన్నారు. అవుట్ పుట్ క్యాంపస్ యొక్క 3డి వీడియోగా ఉంటుందని చెప్పారు. త్వరలో విశ్వవిద్యాలయానికి నాక్ అక్రిడిటేషన్ కమిటీ వచ్చినప్పుడు ఈ వీడియోను ప్రదర్శిస్తామన్నారు. నాక్ అసెస్ మెంట్ సమయంలో మరిన్ని పాయింట్ లను స్కోర్ చేయడానికి ఈ డ్రోన్ వీడియో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ వీడియోను యూనివర్సిటీ వెబ్ సైట్ మరియు సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తామని తెలిపారు. యూనివర్సిటీ సైట్ ఇంజనీర్స్ పి.ప్రేమ్ చంద్, సూపర్వైజర్ కె.దేవలాల్ సాంకేతిక నిపుణులకు సహకరించారు.



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా "గ్రంథాలయోద్ధారక, గ్రంథాలయ పితామహ, గ్రంథాలయ శాస్త్ర విశారద" శ్రీ అయ్యంకి వేంకట రమణయ్య గారికి అక్షర నీరాజనం!!

- నన్నయవాణి

## సంపాదకీయం



# గ్రంథాలయం

తరతరాలుగా సుషుప్తావస్థలో ఉన్న భారతావనికి స్వాతంత్ర్యం సంప్రాప్తించేసరికి తెలుగునాట వేలాది గ్రామాల్లో గ్రంథాలయాలు ప్రజలను చైతన్య పరచడానికి తమ వంతు కృషిని ప్రారంభించాయి. ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రజా సంఘాలు, గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు గ్రంథాలయాల్ని నిర్వహించడం మొదలుపెట్టాయి. మనకొక వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు శ్రద్ధ చూపించడం మొదలు పెట్టాయి. ప్రజల ఆదరాభిమానాలతో గ్రంథాలయాలు ఊరూరా నెలకొల్పబడి అక్షర జ్ఞానాన్ని అందించటం మొదలుపెట్టాయి.

అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం వంటి మహనీయులు గ్రంథాలయోద్యమంలో ఊరూరా తిరిగి చైతన్యాన్ని తీసుకొని వచ్చారు. సామాన్య జ్ఞానం కలిగిన తర్వాత మనిషికి గ్రంథాలయమనేది ఒక సరస్వతీ దేవి గుడి.కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు డిగ్రీ అనో,పీజీ అనో ఒక బిరుదు ఆ డిగ్రీ ద్వారా లభిస్తుంది. కానీ గ్రంథాలయాలను ఉపయోగించుకుని తయారైన విద్యార్థికి అతని పేరే అతనికి బిరుదు అవుతుంది. జ్ఞానతృష్ణ కలిగిన విద్యార్థికి గ్రంథాలయం ఒక ఆలయమే.మన హృదయాల్లో దాగివున్న అపరిమితమైన శక్తిని ఉద్దీపింపచేసేవి గొప్ప గ్రంథాలే.గ్రంథ బాండాగారం నిత్యమూ నిలువ ఉండే పరిమళం.మహా జ్ఞానులైన పూర్వులు మన అందరికీ సమానంగా పంచిపెట్టి పోయిన సార్వజనిక ధనం.

కార్లయిల్ పండితుడు ఎడింబరో విశ్వవిద్యాలయంలో చదువుకోవటానికి ప్రధాన కారణం అక్కడున్న మహత్తరమైన గ్రంథాలయం. అందులో కూర్చుని ఆయన ఇటాలియన్, ఫ్రెంచ్, జర్మన్, భాషలు నేర్చుకున్నాడు.గిబ్బన్, జాన్సన్ లాంటి పాశ్చాత్య మహా పండితులు కేశవచంద్ర సేన్, ప్రతాప చంద్ర మజుందార్, బిపిన్ చంద్రపాల్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి భారతీయ మహనీయులు ఎక్కడా ఏ విశ్వవిద్యాలయాల్లోనూ హాజరు వేయించుకోలేదు. గొప్ప గొప్ప గ్రంథాలయాల్లోనే వీరి హాజరు.

గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వారు – "ఇతర దేశాల్లోని గ్రంథాలయోద్యమాలన్నీ మనిషి మేధాశక్తిని వృద్ధినొందించటానికి ప్రయత్నం చేస్తుంటే, తెలుగునాట గ్రంథాలయోద్యమం మనిషి యొక్క సంపూర్ణ మనుష్యత్వమును వ్యక్తీకరించుటకు తగిన సాధన సామగ్రినంతయూ సమకూర్చుకొని ఉన్నది. మనం అందించే జ్ఞానం నిద్రాణమై ఉన్న ఆత్మను ఉద్దీపింపచేసి పౌరునికి కావలసిన సన్మార్గ జీవనమునకు తీసుకొని వెళ్ళేదిగా ఉండవలెను. గ్రంథాలయోద్యమ ఆదర్శం మనిషికి జ్ఞానాభివృద్ధిని కలుగజేసి పవిత్రవంతమైన జీవయాత్ర సాధకంగా ఉండాలి" అని ప్రబోధించారు.

విద్యార్థులారా! నిరంతరం మొబైల్ ఫోన్ లోకి ఒదిగిపోతున్న మెడల్ని పైకెత్తి తలెత్తుకొని గ్రంథాలయపు అరల వైపునకు అడుగులు వేస్తూ ఉండండి. పుస్తకాల్ని ముట్టుకుని చూడండి. అపరిమితమైన జ్ఞానం మిమ్మల్ని తళుక్కున మెరిసేలా చేస్తుంది. మీ జీవితాలకొక వెలుగును ప్రసాదిస్తుంది. మహనీయుల శ్వాస మీకు తోడవుతుంది. ఈ దేశం మీ చేతుల్లో ఔన్నత్యాన్ని సంతరించుకుంటుంది.


# సరస్వతీ సామ్రాజ్యం

## పుస్తకం




13 డిసెంబర్ 1942 తేదీన గుంటూరులో జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్ధ మహా సభలో సమర్పించిన అయ్యంకి వెంకటరమణయ్య గారి సన్మాన సంచికయే సరస్వతీ సామ్రాజ్యం. దీనికి ప్రదాత డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి. ప్రముఖ కవులు, రచయితలు రచించిన 25 వరకు పద్య, గేయ ఖండికలు 85 తెలుగు సారస్వత, గ్రంథాలయ వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 700 పేజీలతో కాలికో బైండింగ్ గా ప్రచురించిన గొప్ప గ్రంథమిది. మామిడిపూడి వెంకట రంగయ్య , మల్లంపల్లి సోమశేఖర శర్మ , బెల్లంకొండ రాఘవరావు సంపాదకులు. సన్మాన సంచిక ప్రారంభకులు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్ జయపురం మహారాజు శ్రీ విక్రమదేవ వర్మ గారు. ఈ అరుదైన గ్రంథంలో కోరాడ రామకృష్ణయ్య, పిలకా గణపతి శాస్త్రి, నిడదవోలు వెంకటరావు, జమ్ములమడక మాధవరాయ శర్మ, చెళ్ళపిల్ల వెంకట శాస్త్రి, కాకర్ల వెంకట రామ నరసింహం, దువ్వూరి వెంకట రమణ శాస్త్రి, దివాకర్ల వెంకటావధాని, కవికొండల వెంకటరావు, నండూరి రామకృష్ణమాచార్యులు,బండారు తమ్మయ్య, పైడిపాటి సుబ్బరామ శాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, చాగంటి శేషయ్య, జటావల్లభుల పురుషోత్తం వంటి మహనీయుల వ్యాసాల పరంపరతో అరుదైన గ్రంథంగా దీనిని ప్రచురించారు. గ్రంథాలయ ఉద్యమం,తెలుగు నాట పుస్తక భాండాగారాల ఏర్పాటు, గ్రంథాలయోద్యమం కోసం అయ్యంకి వెంకటరమణయ్య గారి కృషి వారితో పాటు ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల పరిశ్రమ వంటి విషయాలతో, విలువైన సాహిత్య వ్యాసాలతో ఈ సరస్వతీ సామ్రాజ్యం సంచికను కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రచురించారు. అరుదైన ఈ గ్రంథం లోని విషయాలు ఇప్పుడున్న తెలుగు తరాలకు తెలియవలసిన అవసరం కూడా ఉంది. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సరస్వతీ సామ్రాజ్యం పుస్తక విశేషాలు నన్నయ వాణి ద్వారా తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

**- పోతుల శివాజి,**
**పరిశోధక విద్యార్థి.నన్నయ విశ్వవిద్యాలయం.**


సరస్వతీ సామ్రాజ్యమ్
అయ్యంకి వేంకటరమణయ్యగారి
సన్మాన సంచిక
డాక్టర్ సర్ కట్టమంచి రామలింగారెడ్డి
కె. టి. ఎం. ఏ., (కేంటబ్) డి. లిట్., ఎం. ఎల్ సి. గారిచే
13-12-42 తేదీన గుంటూరునందు
ఆంధ్రదేశ గ్రంథాలయ సేవక చతుర్థ మహాసభయందు సమర్పింపబడినది.
వ్యాసములు - సందేశములు గల 700 పుటల సంపూర్ణగ్రంథముయొక్క విలువ రు. 20 లు
సరస్వతీ సామ్రాజ్యమ్, దివ్యజ్ఞాన సమాజ భవనములు,
విజయవాడ - 2.

# విద్యుత్ వాహనాలదే భవిష్యత్

**09.11.21 (మీడియాసెల్)** అన్ని దేశాలలో విద్యుత్ వాహనాలకు డిమాండ్ పెరిగిందని భారతదేశంలో విద్యుత్ వాహనాలదే భవిష్యత్ అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు.యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం మరియు రోజ్ ఫీల్డ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై సంయుక్త ఆధ్వర్యంలో "విద్యుత్ వాహనాల వినియోగం – భవిష్యత్ అవకాశాలు" అనే అంశంపై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. వెబినార్ కు అధ్యక్షులుగా ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కన్వీనర్ గా కోర్సు కోఆర్డినేటర్ ఎ.విజయదుర్గ వ్యవహరించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల ద్వారా వాతావరణంలోని కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని దానిని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. భారతదేశంలో సోలార్ పవర్ కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని సోలార్ విద్యుత్ తో వాహనాలు వస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. విద్యుత్ వాహనాలకు విదేశాలలో ఎక్కువ డిమాండ్ ఉందని మనదేశంలో ప్రస్తుత కాలంలో ఎక్కువగా వినియోగిస్తున్నామన్నారు. విద్యుత్ వాహనాలను ఎక్కువగా వినియోగించేందుకు అవసరమైన బ్యాటరీలు,చార్జింగ్ స్టేషన్లు విరివిగా రావాలన్నారు.ఎక్కువ సామర్థ్యం ఉన్న బ్యాటరీలను,తక్కువ ఖర్చుకు అందించగలిగితే విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరుగుతుందన్నారు. పెరుగుతున్న ఇంధనాలు రేట్లు, కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ వాహనాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని తెలియజేసారు. రోజ్ ఫీల్డ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ముంబై సాంకేతిక రచయిత, విద్యుత్ వాహనాల నిపుణులు సుహాస్ జోషీ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల విభాగాలను వివరించారు. బ్యాటరీ మేనేజ్మెంట్, చార్జింగ్ మెథర్డ్స్, విద్యుత్ అవసరాలు, ఆర్థిక మరియు పర్యావరణ పరిణామాలు వంటి అంశాలను వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ సోలార్ పవర్ ను నేరుగా విద్యుత్ వాహనాలకు అమర్చడం అనేది పరిశోధన దశలో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కోర్సు కోఆర్డినేటర్ ఎ.విజయదుర్గ, రోజ్ ఫీల్డ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సి.ఎఫ్.ఓ కస్తూరి భావే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
కస్తూరి భావే.



సమావేశంలో వీసీ జగన్నాథరావు,సుహాస్ జోషి,




ప్రతిభా వాణి

# మౌలానా అబుల్ కలామ్ ఆజాద్

**(11-11-1888 , 22 - 2 -**



మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మౌలానా సౌదీ అరేబియాలోని 'మక్కా' లో జన్మించారు. మౌలానా భారత స్వాతంత్ర్యం కోసం పరితపించిన వ్యక్తిగా, మత ప్రాతిపదికన భారతదేశం విడిపోవటాన్ని వ్యతిరేకించిన నిజమైన భారతీయునిగా, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సాహిత్యం, విద్యా వికాసాల కొరకు కృషి చేసిన వ్యక్తిగా, దేశభక్తికి మతాలు అడ్డురావని నిరూపించిన వ్యక్తి. మహమ్మదీయ సంప్రదాయ పద్ధతిలో విద్యాభ్యాసం జరిపినప్పటికి మౌలానా రహస్యంగా ఆంగ్లం కూడా నేర్చుకున్నారు. 'ముస్లింలీగ్' పార్టీ మొత్తం ముస్లింలందరికీ ప్రాతినిధ్యం వహిస్తోందన్న అపవాదును తుడిచివేయడానికి మౌలానా 'నేషనలిస్ట్ ముస్లిం లీగ్' పార్టీని కాంగ్రెస్‌లో అంతర్భాగంగా స్థాపించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వంలో విద్యాశాఖమంత్రిగా 10 సంవత్సరాలు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించిన మౌలానా ఆజాద్ గారిని నెహ్రూ 'సంస్కృతి, ధైర్యాలకు' ప్రతీక గా కీర్తించారు. 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్' (UGC) ని మౌలానా స్థాపించారు. సాంకేతిక విద్యకు ప్రోత్సా హకంగా 'ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్' ను స్థాపించారు. సైకలాజికల్ స్టడీస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు.

విద్యారంగంలో శాస్త్ర, సాంకేతిక, స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేస్తూనే, కళారంగంలో తన ఆసక్తిని ప్రదర్శించారు. సంగీత, సాహిత్యాలను అమితంగా అభిమానించే మౌలానా 'సాహిత్య అకాడమీ', 'సంగీత నాటిక అకాడమీ', 'లలిత కళా అకాడమీ' లను స్థాపించారు. 'లలితకళా అకాడమీ' ను స్థాపించినపుడు దానికి భవనం లేకపోవటంతో తన నివాసంలో కొంత భాగాన్నిచ్చారు.

1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ లో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింలు మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. అల్ హిలాల్ మోర్లే-మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతం-ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదుర్చటం లో ఒక ముఖ్యమ్కెన పాత్ర పోషించింది. 'అల్ హిలాల్' అతివాద భావనల ఒక విప్లవాత్మక ధ్వనిగా మారింది. ప్రభుత్వం వేర్పాటువాద భావనల ప్రచారకునిగా "అల్- హిలాల్" ను భావిస్తింది. ప్రభుత్వం దానిని 1914 లో నిషేధించింది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ గాంధీజీ ప్రారంభించిన "సహాయ నిరాకరణ"ఉద్యమాన్ని సమర్ధించి 1920 లో భారత జాతీయ కాంగ్రెస్ లో ప్రవేశించారు. ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సెషన్ అధ్యక్షులుగా (1923)ఎన్నికయ్యారు.

గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయ్యారు. ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా 1940 (రాంగడ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై 1946 వరకు ఆ పదవిలో ఉన్నారు.

అబుల్ కలాం ఆజాద్ కి మరణానంతరం 1992 లో భారతదేశం యొక్క అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' లభించింది. భారతీయ విద్యారంగానికి విశేష సేవలందించిన ఆ మహనీయునికి నన్నయవాణి అక్షర నివాళి.

# జాతీయ విద్యా దినోత్సవం

**11.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్,తాడేపల్లి గూడెం క్యాంపస్ లందు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 133 వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఆయన జయంతిని పురస్కరించుకుని భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన కృషిని స్మరించుకున్నారు. తాడేపల్లి గూడెం క్యాంపస్ ప్రత్యేకాధికారి ఆచార్య కె.శ్రీరమేష్ మాట్లాడుతూ మౌలానా విద్యారంగానికి చేసిన కృషిని, పత్రికల ద్వారా వ్యాప్తి చేసిన జాతీయోద్యమ ప్రభావాల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డా.హీరా,డా.అప్పాజీ పాల్గొన్నారు కాకినాడ క్యాంపస్ లో ఆంగ్ల ఆచార్యులు ఎం.పోచయ్య మాట్లాడుతూ మౌలానా భారతదేశంలో విద్య



కు సంబంధించి చేసిన సేవకుగాను ఆయన పుట్టిన రోజును



భారతదేశంలో జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటున్నారని, ఆయన జర్నలిస్టుగా పని చేస్తూ బ్రిటిష్ వ్యతిరేక విధానాలను ఆయన తన పత్రికల్లో రాసి ప్రజలను ఉద్యమం వైపునకు నడిపించారని,ఎన్నో విద్యాపరమైన సంస్థలను నెలకొల్పడానికి ఆయన వంతు కృషిని అందించారని భారతదేశ నిర్మాణంలో ఆయన పాత్ర ప్రముఖమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్. ప్రశాంతిశ్రీ , హేమలత, రాధామాధవి, డా.నాని బాబు, బి.వి.ఏ. స్వామి, డా.శ్రీరామరాజు, డా.విజయశ్రీ ,డా. ఏసురత్నం, బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశోధనలలో నాణ్యత పెరగాలి

**12.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు చేస్తున్న పరిశోధనలలో నాణ్యత పెరగాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ లోని ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ కళాశాలలోని అన్ని విభాగాల పూర్తిస్థాయి పరిశోధకులు, పరిశోధన మార్గదర్శకాలతో వీసీ జగన్నాథరావు రివ్యూ మీటింగ్ ను నిర్వహించారు. అన్ని విభాగాల్లోని స్కాలర్స్ చేస్తున్న పరిశోధన అంశాలు, పరిశోధన పురోగతిని ఒక్కొక్కరిని వీసీ అడిగి తెలుసుకున్నారు. పరిశోధన పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన పరిశోధనలను సమాజానికి అందించాలని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ పరిశోధనలు చేయాలని, ఆ స్థాయిలో రిసెర్చ్ సూపర్వైజర్లు తమ విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యాన్ని ఇస్తుందని, దానిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటూ ఉన్నత స్థాయి పరిశోధనలు సమాజానికి అందించాలన్నారు. యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ద్వారా అందిస్తున్న జేగేట్, జేస్టోర్ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిశోధకులు చేస్తున్న ఒక్కొక్క పరిశోధన సమాజంలోని అనేక సమస్యల పరిష్కారాలకు మార్గాలను చూపేవిగా ఉండాలన్నారు. పరిశోధన ద్వారా నూతన విషయాలు, వాస్తవాలు వెలుగులోనికి తీసుకురావాలని, పరి శోధనలలో రాజీపడే ప్రసక్తిలేదని వీసీ తెలియజేసారు.




విశ్వవిద్యాలయ చరిత్రలో పరిశోధకులు, పరిశోధన మార్గదర్శకా లతో వీసీ రివ్యూ మీటింగ్ నిర్వహించి వారికి మార్గనిర్దేశం చేయడం చాలా గొప్ప విషయమని, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు పరిశోధనలపై ఉన్న పట్టు, ప్రత్యేక శ్రద్ధకు ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల ఫుల్ టైం రిసెర్చ్ స్కాలర్స్, రిసెర్చ్ సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

# నేషనల్ పోస్టర్ మేకింగ్‌లో డా. భవానికి ప్రథమ స్థానం

**12.11.21 (మీడియాసెల్)** మెంటల్ హెల్త్ డేని పురస్కరించుకుని కోల్కతా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ, రాధాబాయి కాలే మహిళా మహావిద్యాలయ మహారాష్ట్ర సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ పోస్టర్ మేకింగ్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగ సహాచార్య డా.సిహెచ్.ఎన్.కె.భవానికి ప్రథమ స్థానం లభించింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి పెరిగితే మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని సమతుల్య జీవనం చాలా అవసరమని అన్నారు. ఈ విషయంపై డాక్టర్ భవాని తయారుచేసిన పోస్టర్ కి ప్రథమస్థానం లభించినందుకు అభినందించారు. అధ్యాపకులు నిరంతరం నూతన ఆవిష్కరణలు, పరిశోధనల వైపు పయనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సైకాలజీ విభాగాధిపతి డా.నారాయణ నక్కిన, డా.పడాల రాజశేఖర్ పాల్గొని భవానికి అభినందనలు తెలిపారు.



**పోస్టర్:** నేటి యువత సుఖానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని సంతోషానికి ఇవ్వటం లేదు. సంతోషం వస్తు సముదాయం లో, వస్తు సేకరణలో ఉండదు. అదొక మానసిక స్థితి. ప్రతి మనిషి జీవితంలో ఎక్కడో ఒకచోట కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు పడవచ్చు. దాని వలన మానసిక ఆరోగ్యం దెబ్బతినదదు. ఆ ఇబ్బంది గురించి ఎక్కువగా ఆలోచిస్తూ మిగిలిన అంశాలను అశ్రద్ధ




చేయటంతో మానసిక ఒత్తిడి పెరిగి అనారోగ్యం కలుగుతుంది. కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం దొరకదు. కొన్నిటిని కాలం పరిష్కరిస్తుంది. డిప్రెషన్, ట్రెస్, వర్రీ పదాలు వాడుతూ బెంబేలు పడుతుంటారు. మానసిక ధైర్యాన్ని, స్థైర్యాన్ని నేర్చుకుంటే సమస్యలను జయించి ఆరోగ్యంగా ఉండవచ్చునేది పోస్టర్ ఇచ్చే సందేశం.

# సీడీసీ డీన్‌గా డా.వెంకటేశ్వరరావు





**12.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ గా డా. పి. వెంకటేశ్వరరావును, ఫ్యాకల్టీ అసోసియేట్ గా డా.జి.కీర్తి మరిటా లను నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ వారికి అభినందనలు తెలియజేశారు.

# యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్

## ఇంజనీరింగ్ ప్రాజెక్టులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు 48 రకాల ప్రాజెక్టులను నమూనాలను ప్రదర్శించారు. వర్క్ షాప్ భవనం ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డా.ఆదిమూలపు సురేష్, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్లు, అధికారులు, ఆయా కళాశాలల సభ్యులు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అభినందించారు.

**ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 2016లో స్థాపించబడింది. ఆధునాత సాంకేతిక పరిజ్ఞానానికి తగినట్టుగా ప్రభుత్వ విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్య అందుబాటులో ఉంది. ఏ.ఐ.సి.టి.ఇ, ఐ.ఎస్.ఓ. గుర్తింపుతో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తుంది. 800లకు పైగా విద్యార్థులు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో విద్యను అభ్యసిస్తున్నారు.**

## ఇంజనీరింగ్ కాలేజ్ వసతులు వనరులు

- విస్తారమైన అకడమిక్ ఎక్స్‌పోజర్‌ని అందించే విద్యకు ఒత్తిడి లేని మరియు విద్యార్థి కేంద్రీకృత విధానం
- విద్యార్థులను బహుళ కోణాల్లో మార్గనిర్దేశం చేసే అర్హత మరియు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విద్యావేత్తలు.
- విభిన్న అభ్యాస అనుభవం కోసం ఎంపికల కోసం బహుళ ఎంపికలతో సౌకర్యవంతమైన పాఠ్యప్రణాళిక.
- విద్యా, సాంస్కృతిక మరియు క్రీడా కార్యక్రమాలతో వైబ్రెంట్ క్యాంపస్ లైఫ్.
- 100 ఎకరాల క్యాంపస్‌లో బహుళ ల్యాబ్‌లు మరియు వర్క్‌షాప్‌లతో బలమైన మౌలిక సదుపాయాలు
- క్యాంపస్ హాస్టల్స్, ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ & ఉచిత అపరిమిత Wi-Fi
- స్టూడెంట్ క్లబ్‌లు, వాల్ జర్నల్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోస్, ఇన్నోత్సవ్ వంటి విద్యార్థుల కోసం సృజనాత్మక కార్యక్రమాలుఆవిష్కరణలను ప్రోత్సహించడానికి హౌస్ యాప్ అభివృద్ధి కార్యక్రమాలు

## సెల్ఫ్ క్లీనింగ్ రోడ్స్



రహదారులపై ఉన్న రెడార్స్ ను ఉన్నతంగా ఉపయోగించి రహదారులను శుభ్రపరచడం, సమీపంలోని మొక్కలకు నీటిని అందించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. రహదారులకు మధ్యలో ఉండే రెడార్స్ రాత్రులు ప్రయాణాలలో మార్గ నిర్దేశం చేస్తాయి. రహదారుల మధ్యలో ఉండే డివైడర్స్ ద్వారా వాటర్ పైప్ లైన్లను వేసి ప్రతీ కిలోమీటర్ కు ఒక రెడార్ కు వాటర్ కనెక్షన్ ను ఇచ్చి ఆ రెడార్ నుండి వచ్చే నీటితో ఆటోమేటిక్ గా రోడ్డు శుభ్రమయ్యేలా చేస్తారు. శుభ్రం చేసిన నీటిని రహదారులకు అనుకుని ఉన్న మొక్కలకు అందిస్తారు. తక్కువ మంది వ్యక్తులతో నిత్యం రోడ్లు శుభ్రంగా ఉంచడంతో పాటు రహదారులను పచ్చని తోరణలుగా చేయవచ్చు.

సివిల్ మూడవ సంవత్సరం విద్యార్థుల సెల్ఫ్ క్లీనింగ్ రోడ్స్

## మోడల్ నన్నయ యూనివర్సిటీ



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని భవిష్యత్ లో ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చు అనేది ఈ ప్రాజెక్టు యొక్క ఉద్దేశం. సాంకేతికంగా, పర్యావరణహితంగా, ట్రాఫిక్ సమస్యలు లేకుండా, సుందరంగా, భవనాలకు రక్షణ కల్పిస్తూ, పక్కాప్రణాళికతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ మోడల్ ను విద్యార్థులు రూపొందించారు.

సివిల్ మూడవ సంవత్సరం విద్యార్థుల నన్నయ ప్రాజెక్టు

## పేటెంట్ స్థాయి ప్రాజెక్టులు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు అద్భుతంగా ఉన్నాయి. సృజనాత్మక ఆలోచనలతో విద్యార్థులు నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులు పేటెంట్ స్థాయికి తీసుకువెళ్ళే అధునాత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ప్రాజెక్టులుగా ఉన్నాయి. మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఆలోచనలు చేస్తూ సాంకేతిక విద్యలో రాణించడం హర్షనీయం."

**- డా.ఆదిమూలపు సురేష్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి**

## హైవే విండ్ టర్బైన్

వేగంగా వీస్తున్న గాలితో విద్యుత్తు తయారు చేసి హైవేల్లో వీధి దీపాలు వెలిగించే వినూత్న ప్రాజెక్టు ఇది. హైవేల మధ్య డివైడర్లపై టర్బైన్ లను ఏర్పాటు చేస్తారు. హైవేపై వాహనాలు వేగంగా వెళ్ళినప్పుడు వీచే గాలికి టర్బైన్ తిరిగి జనరేటర్ ద్వారా విద్యుతుత్పత్తి అవుతుంది. దాంతో వీధి దీపాలు వెలిగేలా చేస్తారు. తక్కువ నిర్వహణ వ్యయంతో విద్యుత్తు కొరత సమస్యను అధిగమించి ప్రయోజనం పొందవచ్చు.

మెకానికల్ మూడవ సంవత్సరం విద్యార్థుల హైవే విండ్ టర్బైన్ ప్రాజెక్టు




## ప్రయాణాలు- ప్రమాదాలు



రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రజలను రక్షించేందుకు, తక్కువ ఖర్చుతో బైక్ ప్రయాణాలు చేసే ప్రాజెక్టులు ఇది. **యాక్సిడెంటల్ ఇండికేటర్** – మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న,సీటు బెల్ట్ పెట్టుకోకపోయిన అప్రమత్తం చేస్తుంది. **మోటర్ సైకిల్ ఎయిర్ బ్యాగ్ సిస్టమ్** – బైక్ ప్రమాదాలలో ప్రాణహాని కాకుండా పూర్తిగా మనిషికి రక్షణ కల్పించే ఎయిర్ బ్యాగ్ సిస్టమ్ **హైబ్రిడ్ బైక్** – పెట్రోల్ మరియు కరెంట్ తో నడిచే ఈ హైబ్రెడ్ బైక్ తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ను ఇస్తుంది.

ఈ.ఐ.ఈ. రెండవ సంవత్సరం విద్యార్థుల మూడు ప్రాజెక్టులు

## అల్గోరిథం విజువలైజేషన్




విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, యానిమేషన్ రూపాలలో పాఠ్యాంశాలను బోధించి సాంకేతిక విద్య ప్రాజెక్టు. సాంకేతిక విద్య విధానం ఎంతో అభివృద్ధి చెందుతుంది. అటువంటి నూతన సాంకేతిక విద్య బోధన పద్ధతే అల్గోరిథం విజువలైజేషన్. శాస్త్ర, సాంకేతిక రంగాల విద్యార్థులకు బోర్డుపై బొమ్మలు గీసి పాఠాలను బోధిస్తుంటారు. దానికి భిన్నంగా అల్గోరిథం విజువలైజేషన్ ద్వారా కంప్యూటర్, ల్యాంప్టాప్, ప్రోజెక్టర్ల సహాయంతో 3డి, యామిమేషన్, డిజిటల్ ఇమేజెస్ రూపంలో పాఠ్యాంశాలను బోధించవచ్చు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు ఆసక్తికరంగా, అర్థమయ్యే విధంగా పాఠాలను చెప్పేందుకు ఉపయోగపడుతుంది.

సి.ఎస్.ఈ నాల్గవ సంవత్సరం విద్యార్థుల అల్గోరిథం విజువలైజేషన్

## సెక్యూరిటీ సిస్టమ్



సెన్సార్స్ ను ఉపయోగించి నిషేదిత ప్రదేశాలలో జనసంచారం తెలుసుకోవడం మరియు వాహన భద్రతకు సంబంధించిన సెక్యూరిటీ సిస్టమ్ ప్రాజెక్టు. నిషేధిత ప్రదేశాలలో జనసంచారాన్ని తెలుసుకోవడానికి తక్కువ ఖర్చుతో సెన్సార్లను ఉపయోగించి దీనిని రూపొందించారు. సెన్సార్లు సహాయంతో నిషేధిత ప్రదేశాలలో సంచార సమాచారాన్ని అలారం, లైటింగ్ వంటి సూచనలు ద్వారా తెలుస్తుంది. అలాగే వాహనాలకు సెన్సార్లును అమర్చి ఇతర వాహనాలు దగ్గరకు వచ్చినప్పుడు అలర్ట్ చేసే వాహన భద్రత సెక్యూరిటీ సిస్టమ్ ప్రాజెక్టు.

ఈ.సి.ఈ మూడవ సంవత్సరం విద్యార్థుల సెక్యూరిటీ సిస్టమ్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in